క్లుప్తంగా

నేడు సత్యవరంలో ఆధార్ క్యాంపు

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో ఈ నెల 23, 24 తేదీలులో ఆధార్ క్యాంపులు గ్రామ సచివాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారని, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి తెలిపారు. ముందుగా అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు అవకాశం కలిస్తారన్నారు. ఈ అవకాశం గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మాడుగుల రూరల్ : ఈ ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపు కోరుతూ మండలంలో పలు పాఠశాలల్లో బుధవారం వారి సంఘం ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేశారు. మండలంలో జి.అగ్రహారం, వీరనారాయణపురం, గాదిరాయి, ఒమ్మలి, కింతలి, ఎం.కోడూరు తదితర పాఠశాలలు, కళాశాలలు తిరిగి ప్రచారం చేశారు. 2019లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా ఏపీటీఎఫ్ బలపరచిన తనను గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి కోరారు. ప్రచారంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీపురుపల్లి జగదీష్, కె.కృష్ణయ్య, చందనవర్మ, దత్తాత్రేయ, మండల ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సూరిబాబు, జగన్నాథరావు పాల్గొన్నారు.

వడ్డాదిలో నిరుపేదలకు వస్త్రదానం



వడ్డాదిలో పేదలకు దుస్తులు అందిస్తున్న కామేశ్వరరావు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో నిరు పేదలకు అతిథి దేవో భవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు ఉచితంగా దుప్పట్లు, చీరలు అందించారు. తన తల్లి గంగమ్మ జ్ఞాపకార్థం బుధవారం ఆయన వంద మంది పేదలకు ఉచితంగా అన్న సమారాధన చేసి, వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి ఇనుప బీరువా వితరణ

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారికి వెండి ఆభరణాలు, ఇనుప లాకర్ బీరువాను దాతలు బుధవారం అందజేశారు. మాడుగుల గ్రామానికి చెందిన శ్రీనాధు శ్రీనివాసరావు, పరమేశ్వరి, వారి కుమారుడు స్వరూప్, సుజాత దంపతుల ఆర్థిక సాయంతో సుమారు రూ.40 వేల విలువ గల బీరువాను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫంగిడిలో కోడిపందేలపై పోలీసుల దాడి

బుచ్చెయ్యపేట : మండలంలో గల పెదపూడి శివారు ఫంగిడిలో కోడిపందేలపై బుచ్చెయ్యపేట పోలీసులు దాడి చేశారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న రామాలయం తీర్థ మహోత్సవం సందర్భంగా కొంతమంది గ్రామ శివారులో కోడిపందేలు ఏర్పాటు చేశారు. కోడి పందేలపై నిర్వహణపై వచ్చిన సమాచారం మేరకు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు రెండు కోడి పుంజులు, పందెంలో కాసిన రూ, 1,110 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోడి పుంజులను, పట్టుకున్న నగదు, కోడి పందేల నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్ మాట్లాడుతూ 53 మందికి కంటి పరీక్షలు చేసి 30మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

మంచుకోరల్లో మామిడి

- వేలాది ఎకరాల్లో రాలిపోతున్న పూత
- నష్టాలపాలవుతున్న మామిడి, జీడి రైతులు



మంచుకి మాడిపోయిన మామిడి పూత

పూతరాలిపోయిన జీడిమామిడి చెట్టు

చోడవరం : ఈ ఏడాది కూడా మామిడి,జీడిమామిడి పంట నష్టాల బారిన పడింది. గత రెండేళ్లుగా మామిడి,జీడిమామిడి రైతులకు నష్టాలు వాటిల్లుతుండగా ఈ ఏడాది పూత ఆశాజనకంగా ఉండడంతో రైతులో మొదట్లో ఎంతో ఆనందపడ్డారు. తర్వాత వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు పంటకు తేరుకోని దెబ్బకు గురిచేసింది. ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం,మునుపెన్నడూలేని విధంగా మంచు కురవడంతో ఈ పంటకు తేరుకోలేని దెబ్బతగిలింది. పూతదశలో ఉన్న మామిడి, జీడిమామిడి తోటలకు మంచు కమ్ముకోవడంతో పూతదశలోనే పంట నష్టాలకు గురవుతుంది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ పంటలపై ఏటా 60 నుంచి 80 కోట్లరూపాయల మేర వ్యాపారం సాగుతోంది. డిసెంబరు నెల నుంచి పూత ప్రారంభమైన మామిడి, జీడిమామిడి పంటలకు 15 రోజుల వరకు ఉష్ణోగ్రతలు బాగానే అనుకూలించాయి. మంచు కొద్దిగానే కురవడంతో పూత ప్రారంభంలో ఉష్ణోగ్రతల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో తోటలన్నీ పూతతో కలకలలాడాయి. అయితే రెండువారాలుగా వాతావరణంలో భారీ మార్పులు ఏర్పడి ఉష్ణోగ్రతలు ఒక్క సారిగా పడిపోయాయి. గిరిజన ప్రాంతాల్లో మైనస్ డిగ్రీలకు పడిపోతే మైదాన ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 5 నుంచి 10 డిగ్రీలకు పడిపోయింది. దీంతో మంచుతెరలు కమ్ముకుని పొగమంచు కమ్ముకొని జల్లులుగా పడుతోంది. సాయంత్రం నుంచి ఉదయం 9గంటల వరకూ మంచు విపరీతంగా కురుస్తుంది. 30శాతానికి పైబడి పూత ఇప్పటికే రాలిపోయింది. ఇదే పరిస్థితి మరిన్ని రోజులు కొనసాగితే పూత మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలతో పాటు పాడేరు, అరుకు గిరిజన ప్రాంతాల్లో కూడా ఈ ఏడాది అదనంగా సుమారు 20వేల ఎకరాల్లో మామిడి, జీడిమామిడి హైబ్రీడ్ తోటలు సాగులోకి వచ్చాయి. 2014హుద్‌హుద్ తుఫాన్‌కు తీవ్రంగా మామిడి, జీడిమామిడి తోటలు దెబ్బతినడంతో ఆ తోటలు స్థానే వేసిన హైబ్రీడ్ తోటలు ఈ ఏడాది పూతకు వచ్చాయి. ఈ తోటలు కూడా మంచు బారిన పడ్డాయి. పూతను కాపాడుకోవడానికి రైతులు పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం మాత్రం స్వల్పంగానే ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత చాలా దెబ్బతింది



నేను 5ఎకరాల మామిడి తోట కౌలుకి తీసుకున్నాను. రూ. 2లక్షలు వరకు ఈ తోటపై పెట్టుబడి పెట్టాను. పూత మొదటి దశలో చాలా బాగుంది. కానీ మంచు చాలా ఎక్కువగా పడుతుండడంతో పూత మాడిపోయి రాలిపోయింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం రాయితీపై మందులు అందించాలి.

– దేముడునాయుడు, మామిడి రైతు

పోషకాలు అందించాలి

పూత దశలో తేనె మంచు, పురుగు ఎక్కువగా పూతకు పడతాయి. ఇవి పూతపై ప్రభావం చూపడంతో పూత దెబ్బతింటుంది. మామిడి, జీడిమామిడి తోటలకు పోషకాలు కూడా వేయాలి. 13045 ఎరువును పూతకు పిచికారీ చేస్తే ఆ నష్టం నుంచి రక్షించుకోవచ్చు. ఇమిడాక్లోప్రిడ్ 0.5మిల్లీలీటరు, లేదా ఫిప్రోనిల్ 2మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– పుష్ప లీలావతి, ఉద్యానవనశాఖ అధికారి

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం



సీతారాములను దర్శించుకొంటున్న భక్తులు

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో సీతారాములు, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని భక్తులు నూతన సీతారామ మందిరం వద్ద ఘనంగా నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించిన మాదిరిగానే అదే రోజు ఈ రామమందిరంలో ప్రతిష్ఠించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్ కాంతమ్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక మహిళల కోలాటంలో సీతారాముల కీర్తనలు వినిపించారు. ఆలయం వద్ద శాంతి హోమం నిర్వహించారు. ఉప సర్పంచ్ అప్పలనాయుడు, పోతలవాని ట్యాంకు అధ్యక్షుడు రమణాజీ, రోలుగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకట్రావు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

సంబరంగా తీర్థ మహోత్సవాలు



మోదకొండమ్మను దర్శించుకుంటున్న ఆయల చైర్మన్ రమణ తదితరులు

మాడుగుల : వొమ్మలి గ్రామంలో బుధవారం అత్యంత వైభవంగా మోదకొండమ్మ తీర్థం నిర్వహించారు. తెల్లవారు నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భజన పోటీలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేలవేషాలు, చిటికల భజనలు అలరించాయి. ఈ తీర్థమహోత్సవాలు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం గ్రామంలో తాచేరు నది పక్కన గల సాధు జగ్గయ్య గోలి వద్ద తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్య కుటుంబ సభ్యులు పసుపు, కుంకమలతో పూజలు నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీశెట్టి జగ్గారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయరాం

నర్సీపట్నం : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయరాం పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఫిబ్రవరి ఒకటి నుండి 45 రోజుల పాటు స్కీమ్‌లు, చేతి పంపుల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో 11 స్కీమ్‌ల మరమ్మతులకు జెడ్పీ నుంచి రూ.60 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే మరమ్మతు పనులు చేపడతామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగు నీరు అందించేందుకు ప్రభుత్వానికి రూ.350 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు.

గోవాడ సుగర్స్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



గోవాడ ఫ్యాక్టరీలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారం అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చోడవరం మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గంధవరంలో నిర్మాణంలో ఉన్న విత్తన శుద్ధి కార్మాగారాన్ని, చోడవరం పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతుబజార్, తహసీల్దార్ కార్యాలయం భవనాలను ఆయన పరిశీలించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ పనితీరును, ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మెయిన్‌రోడ్డుకు మరమ్మతులు పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు మంత్రి రవీంద్ర దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులు, రైతులకు రూ.9 కోట్ల మేర పాత బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించేందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. రోడ్డు మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి, ఇథనాల్, బయోడీజిల్ యూనిట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని మంత్రి చెప్పారు. విత్తన అభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవిని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, గోవాడ సుగర్స్ ఎండీ సన్యాసినాయుడు, తహసీల్దార్ రామారావు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గౌరీశంకర్, పల్లా అర్జున మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మచ్చిరాజు పాల్గొన్నారు.

అంజనాదేవి ట్రస్టు క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న జనసేన నాయకులు

గొలుగొండ : అంజనాదేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా నర్సీపట్నం నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని నర్సీపట్నం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్ర తెలిపారు. గొలుగొండలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో 2025 సంవత్సరంకు సంబంధించి అంజనాదేవి ట్రస్టు క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది మరిన్ని సేవలకు సహకారం అందిస్తామన్నారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గండెం దొరబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, ట్రస్టు ప్రధాన నాయకులు పి.నాగు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



చోడవరంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చోడవరం : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద కాలేజీ విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డుపై ర్యాలీ చేసి కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను, సీట్‌బెల్టు ధరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపరాదని, అధిక ప్రయాణికులను ఎక్కించరాదని, లైసెన్సు లేనివారు డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంతోష్, ఏఎస్‌ఐ గోవిందరావు, ప్రసన్నకుమార్ వినయ్‌కుమార్, జ్ఞాన దీప్, దేముడు నాయుడు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి రూ.10వేల విరాళం



ఆలయ సిబ్బందికి నగదు అందిస్తున్న అయ్యప్పరెడ్డి

మాడుగుల రూరల్ : మండలంలో గల ఎం.కోడూరు సాయిబాబా దేవాలయ నిర్మాణానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో కొత్తగా సాయిబాబా ఆలయ నిర్మాణం జరుగుతుంది. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ అయ్యప్పరెడ్డి, ఉమామహేశ్వరి దంపతులు బుధవారం గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు పడాల అప్పలనాయుడు, చిట్టిబాబులకు నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ రమణబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయాలి



వాలాబులో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు

దేవరాపల్లి : గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో 2023-24కు సంబంధించిన రికార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి వాలాబులో పర్యటించారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా బురదనీరు రాకుండా నివారించేందుకు అవసరమైన మైక్రో ఫిల్టర్, పంప్ హౌస్ ఏర్పాటుకు జిల్లా పరిషత్ నుంచి రూ.23 లక్షలు నిధులు మంజూరు చేశామని, ఈ పనులు తక్షణమే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌కు జెడ్పీ సీఈవో సూచించారు. మండలంలోని మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేయడంతో పాటు శుభ్రపరచాలని ఆదేశించారు.

పెదనందిపల్లిలో నేడు సత్యనారాయణ తీర్థం



పెదనందిపల్లి శ్రీ విజయ వెంకట సత్యనారాయణ స్వామివారు

దేవరాపల్లి: మండలంలోని పెదనందిపల్లిలోని శ్రీ విజయ వెంకట సత్యన్నారాయణ స్వామి తీర్థ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెదనందిపల్లి సత్యనారాయణ స్వామి తీర్థాన్ని రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. పెదనందిపల్లి, చిననందిపల్లి, మారేపల్లి, చేనులపాలెం, తారువా, తిమిరాం, ఎం.అలమండ తదితర గ్రామాల ప్రజలు ఈ తీర్థాన్ని జరుపుకొంటారు. దీనికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. కొండపై ఉన్న ఆలయం వద్దకు మెట్ల మార్గం గుండా చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు. తీర్థం సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చౌడువాడలో నేడు సీతారామాంజనేయ తీర్థం

కె.కోటపాడు : మేజర్ పంచాయతీ చౌడువాడలో గురువారం సీతారామాంజనేయ తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యే పూజలు నిర్వహించేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తీర్థాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించనున్నారు. విజేతలకు నగదు పురస్కారం అందించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీలకు కొత్తగా 29 మరుగుదొడ్ల మంజూరు



అంగన్‌వాడీ కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు పరిశీలిస్తున్న జేఈ దేవదత్తు

నాతవరం : మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మరుగుదోడ్లు పనుల ను ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ దేవదత్తు బుధవారం పరిశీలించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా 29 మరుగుదొడ్లు మంజూరైనట్టు తెలిపారు. ఒక్కో యూనిట్‌కు రూ. 35 వేలు చొప్పున నిధులు రావడంతో జోరుగా పనులు చేస్తున్నామన్నారు. ఇంతవరకు 21 మరుగుదోడ్లు పూర్తి చేశామని, మిగిలినవి నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్కు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పశువ్యాధులకు సకాలంలో చికిత్సలు



పశువులను పరీక్షిస్తున్న సిబ్బంది



పాడి రైతులు, గొర్రెల కాపరులకు మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి బాల మౌనిక



నాగయ్యపేటలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి మంజుషారాణి



పి.పి.అగ్రహారంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మణిదీప్



ఎ.కోడూరులో పశువైద్యం అందిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

నాతవరం : పశువైద్య శిబిరాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పాయకరావుపేట పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన మండలంలో బుధవారం పెదగొలుగొండపేట, వెంకయ్యపాలెం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. లేగదూడలకు పాముల మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి పాడి పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పెద గొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ పాల్గొన్నారు.

రోలుగుంట : శరభవరం గ్రామంలో మండల పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి బాల మౌనిక శిబిరంలో 140 పాడి పశువులకు చికిత్సలు అందించారు. 600 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందజేశారు. 20 పశువులకు సాధారణ వైద్యం చేశారు. కోళ్లకు తెగులు రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : నాగయ్యపేటలో పశు ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి 54 పశువులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. గొర్రెలు, మేకలకు, నులిపురుగుల నివారణ మందును తాగించారు. 320 పౌల్ట్రీ కోళ్లకు టీకాలు వేశారు.

రెండు గ్రామాల్లో 130 పశువులకు వైద్య పరీక్షలు

మాకవరపాలెం: రెండు గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాల్లో 130 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. బుధవారం భీమబోయినపాలెం, పి.పి.అగ్రహారం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్ మాట్లాడుతూ పాల దిగుబడులు పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు.

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 22 పశువులకు గర్భకోశ చికిత్సలు, 19 పశువులకు చూడి తనిఖీలు, 10 పశువులకు సాధారణ వైద్యం అందించారు. మరో 18 పెయ్యిలకు నట్టల నివారణ మందు వేశారు. పాడి రైతులకు మందులతో పాటు లవణ మిశ్ర మం ప్యాకెట్‌లను అందించారు. పశువైద్య సహాయకులు ఆర్.సాయికుమార్, శివ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడ : పశు ఆరోగ్య శిబిరాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. అప్పల రాజుపురం,అర్జునగిరి గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు జరిగాయి. కార్యక్రమంలో పశువులకు, పెయ్యిలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను తాగించి శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాడుగుల సహాయ సంచాలకుడు డా.చిట్టినాయుడు, సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, రమాదేవి పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : పాడి రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు ఎ.రవిచంద్ కోరారు. బుధవారం ఖండేపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు.

సర్పంచ్ శానాపతి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో గవరవరం పశువైద్యాధికారి అచ్యుతరామ్ మాట్లాడుతూ పశు ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా పశు సంపదను పెంచవచ్చన్నారు. శిబిరంలో 42 పశువులకు చికిత్స, 14 గర్భకోశ వ్యాధుల పరీక్ష , 4 పశువులకు చూడి పరీక్షలు, 550 గొర్రెలు, మేకలు, పెయ్యలకు నట్టల నివారణ మందులు వేశారు. శిబిరంలో పశు వైద్య సహాయకులు మురళి, రాంబాబు పాల్గొన్నారు.